


తోడి - రూపకం

నీదాసుల భంగములు - నీవు జూతురా
యేదని చూచేవు నీకు - నెచ్చరించ వలెనా

పాల సముద్రము మీద - పవళించి నట్టి నీకు
బేలలై సురలు మొర - బెట్టిన యట్లు
వేళతో మామనవులు - విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మ - మ్మిట్టే రక్షించరాదా

ద్వారకా నగరములో - తగనెత్త మాడేనీకు
బీరాన ద్రౌపది మొఱ - బెట్టిన యట్టు
చనవుతో మాకోరికె - సారె విన్నవించితిమి
విని శ్రీ వేంకటేశుడా - వేగ రక్షించరాదా?

అన్నమాచార్యులు మళ్లీ పాడారు.

నీ దాసుల పరాభవం చూడ నిచ్చగించావా నీవు. యింకా యేమి చూస్తున్నావు నీవు ? నిన్ను హెచ్చరించాలా నేను.

క్షీరసాగరశాయివైన నీకు రాక్షసుల బాధలు భరించలేక దీనులై దేవతలు మొరబెట్టుకున్న విధంగా, అవసరార్థం మా మనవులు విన్నవించాము నీకు. నిద్రపోతున్నావెందుకింకా, అవలీలగా మమ్ము రక్షించవచ్చుగదా.

భార్యలతో ద్వారకానగరంలో పరియాచకాలు ఆడుతున్న నీకు భీరువై ద్రౌపది మానరక్షణార్థం మొరబెట్టినట్లుగా రాజ సభలలో ఘోరమైన అవమానం పొంది, కుంది

ఖిన్నులమై విన్నవించాముగదా నీకు ? నీకు పరాకెలా వస్తోంది ? యిప్పుడే రక్షించవచ్చు గదా మమ్ము ?

'అలవైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబుదా
పల మందార వనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమా వినోదియగు నాపన్న ప్రసన్ను' నకు
విహ్వల నాగేంద్రము పాహి పాహి యని' మొరబెట్టినట్లు

నీకూ మాకూ ఉన్న చనువూ, మైత్రీ పురస్కరించుకొని మా కోరిక విన్నవించాము. ఇకనైనా అది విని శ్రీవేంకటేశ్వరా ; మమ్ము వేగమే రక్షించరాదా అన్న ఈ సంకీర్తనం సంకీర్తనాచార్యులు పాడగానే సంకెల బందులు బిగి సడలి, వదులై భూపతనం చెందాయి. రాయలు ఆచార్యులకు సాష్టాంగపడి 'అపరాధిని ఆచార్య అనుగ్రహింపు'మన్నాడు. హరిదాస ద్రోహం, హరిద్రోహంకన్నా మహా పాపమని రాయలకు హితవుచెప్పి, అన్నమాచార్యులు ఈ నరారణ్యంలో ఉండరాదని తిరుమలకు తరలిపోయారు.